

# పిన్ని

ఆంధ్ర పత్రిక - 16-12-66

---

**పిల్లలు బాగుపడ్డా - చెడిపోయినా తల్లినే బాధ్యురాల్ని చేయకండి. తండ్రి సహకారం కూడా కావాలి.**

**- జయప్రద**

---

"పిన్నీ! వస్తున్నా పిన్నీ నువ్వు నాకు నా చంపల మీద బహూకరించిన వేళ్ళ గుర్తుల మధుర స్మృతులతో ఇంతవరకు నెగ్గుకొచ్చిన నేను చదువైపోయి నీ దగ్గరకు పరుగెట్టుకొస్తున్నాను. ఆనాడు కాదు నువ్వు చెయ్యెత్తితే అమ్మమ్మ ఒడిలో దాగడానికి..."

ఆ రోజు వచ్చిన ఉత్తరంలోని ఆ మాటలే పదేపదే చదువుకుంది జగదేశ్వరి.

కళ్ళనుండి ఆనంద భాష్పాలు చెంపమీదుగా జారిపోతున్నాయి. ఆమె పెదవులు వణుకుతున్నాయి. ఆ ఒక్కమాట కొరకు ఎంతకాలం నుండి ఎదురు చూచింది! చాలు చాలు. వాడికి తనమీద కోపంలేదు. అంతకంటె తను వినాలనుకున్న సంతోషకరమైన విషయమింకేముంది? ఎవరి మౌనమూ తనను బాధపెట్టలేదు. కాని ఎవరినైతే తను పది సంవత్సరాలు తన చేతుల మీదుగా పెంచిందో వాడు మౌనం వహిస్తే సరిపెట్టుకో

లేకపోయింది. ఇన్ని ఏళ్ళుగా 'ఎప్పుడైనా రాకపోతాడా' అని తలుపులు బార్లా తెరిచి వుంచింది. తన విశ్వాసమెప్పుడూ తనను మోసం చేయదు. వాడీరోజు వస్తున్నాడు.

'ఎంతవాడయి వుంటాడో! సి.ఏ. పాస్ అయిన నా కొడుకును ఎంతమంది గౌరవిస్తారో! ఒంట్లు సరిగ్గా చెప్పడం రాలేదని పిన్నిచేత మొట్టికాయలు తిన్నవాడి అడుగులకు ఎంతమంది మడుగులొత్తాలో... ఆ లెక్కలు అవన్నీ చేయలేక ఎంతగా సతమతమైపోయి చిక్కిపోయాడో బిడ్డ! అన్నిటి మధ్యా ఈ బీద పిన్ని, ఎవరి చేతిలో అయితే దెబ్బలు తినలేక పారిపోయాడో ఆ పిన్ని ఇంకా గుర్తుందా? ఎంత అదృష్ట వంతురాలిని చేస్తున్నావురా!'

ఈ ఇంటికొచ్చిన ఇంతకాలానికి ఆమె మనసు ఆనందంతో గంతులేసింది. అప్పుడే అక్కడి కొచ్చిన తన పన్నెండేళ్ళ పెద్ద కొడుకును ఒళ్ళోకి తీసుకుని గట్టిగా ముద్దు పెట్టుకుంది.

"రాజా! ఈ రోజు మీ అన్నయ్య వస్తున్నాడురా."

వాడు అమ్మవైపు నిర్లక్ష్యంగా చూస్తూ "అన్నయ్యెవరు నాకు?" అన్నాడు.

ఆమె వాడి బుగ్గలు నిమురుతూ అంది "నా పిచ్చి తండ్రీ! నీకేమీ తెలియదు. రమేషన్నయ్య లేడూ.... వాడురా."

రాజు ఒక్కమారు ఆశ్చర్యపోయి నోరు చప్పరించాడు.

"వాడు నా కన్నయ్యేంటి? నాలాగా నీ దగ్గరే వున్నాడా ఏం?"

తల్లి మనస్సు చివుక్కుమంది. తన కొడుకు మనస్తత్వం తెలిసినా వాడి మాటలకు ఎప్పటికప్పుడు ఆమె బాధపడుతూనే ఉంటుంది.

"అవును బాబూ! నీలాగవాడు నా దగ్గర లేడు. నువ్వు మాత్రమే నా కొడుకువు. కానీ నువ్వు నీ తల్లి బ్రతికుండగా ఆమె కేవిధంగానూ పనికిరావు. ఆమె శవానికిమాత్రం కొరివి పెట్టగలవు" ఆమె బాధను మనసులోనే దాచుకుంది.

"నీ మాటలకేంగాని ఈరోజు రమేష్ వస్తున్నాడు. గూడుబండి కట్టించుకు వెళ్ళు స్టేషనుకు."

"పొమ్మా. నువ్వెప్పుడూ ఇంతే. ఇప్పుడు కోడిపందేలకొస్తానని చెప్పాను."

"అవును వాళ్ళేమయినా అనుకోవచ్చు... ఏమీ అనుకోంది ఈ అభాగ్యపు తల్లి ఒకతేగా... సరే వెళ్ళు" నిట్టూర్చింది.

అప్పటివరకూ ముళ్ళమీద కూర్చున్నట్టున్న తల్లి ఒడిలోనుండి ఒక్క గెంతు గెంతి పరుగెట్టి పుంజును చేజిక్కించుకుని వెళ్ళిపోయాడు రాజు. వాడు వెళ్ళినవైపే

నిస్సహాయంగా చూచిందామె. 'వీడు చెడిపోతున్నాడు' మనసులోనే గొణుక్కుంది. వెంటనే రమేష్ ఆలోచనలలోకి జారిపోయిందామె.

* * * * *

వాకిట్లో కారు శబ్దం వినగానే వరండాలోకి పరుగెట్టింది. అక్క రమేష్‌ను చేతి కందిస్తూ "వీడిని పెంచటం నా చాత కాదు తల్లి. ఒకటే పిన్నీ పిన్నీ అని ఏడుపు" అంది. అప్పుడు కొండ ఎక్కినంత సంతోషమయింది తనకు. లేకపోతే పుట్టిన బిడ్డను పెంచమని తన దగ్గర వదిలిపోయి ఐదు సంవత్సరాలు పెంచాక "నా ఆరోగ్యం బాగయింది. ఇక నేను తీసుకెళ్తాను" అని తనకు గాకుండా వాడిని తీసుకెళ్ళి పోతుందా? మూడు నెలలు తిరగకుండానే తిరిగి తీసుకొచ్చింది.

ఆ తర్వాత ఐదేళ్ళు తన పెంపకంలో పెరిగాడు వాడు. వాడి తెలివి అమోఘం. వాడి జ్ఞానం తనని ఎప్పటికప్పుడు ఆశ్చర్య పరుస్తుండేది. చురుకుదనంతోపాటు, వాడికి పొగరు కూడా హెచ్చుపాళ్ళలోనే వుండేది. అందుకే అప్పుడప్పుడు తనచేత బలంగా దెబ్బలు తినేవాడు. ఎన్ని దెబ్బలయినా తినేవాడుగాని తనకిష్టం లేకపోతే అసలు చదవడానికి ఒప్పుకునేవాడు కాదు. అటువంటప్పుడు, ఉడుకు రక్తంలో ఉద్రేకంతో వాడు వెక్కి వెక్కి ఏడ్చేవరకు, కొట్టేది. ఒక రోజు వాడిమీద చెయ్యి ఎత్తబోతుంటే అమ్మ అడ్డు వచ్చింది. "అమ్మా! నీ మనవడికి సిల్కు చొక్కాలు కుట్టించడంకాదు. కాస్త బుద్ధులు కూడా నేర్పనీ" అంది కోపంగా వాడివైపు చూస్తూ. అమ్మ నవ్వి అంది. "తొందర పడవద్దులే జగతీ! నీ కొడుకుల్ని బుద్ధిమంతుల్ని చేద్దువుగానిలే" అప్పుడు తను ప్రతిజ్ఞ చేసింది గర్వంగా. తన కొడుకుల్ని ఘనంగా నలుగురిలో తలెత్తుకు తిరిగేలా చేస్తానని... కానీ... జరిగిందేమిటి? కోడి పందేల కొరకు తల్లిమాట కాదనే ఈ సుపుత్రుడికా తను తల్లి?

అమ్మను తలచుకుని ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అమె అనుభవంతో చెప్పే మాటలన్నీ తను ఖండించేది. ఒకరోజు బాగా గుర్తుంది. ఆ మర్నాడు అక్క వస్తుంది. కొడుకు చదువును పరీక్ష చేసుకుంటుంది. అందుకని వాడికిరాని ఇంగ్లీషు పాఠం పట్టుదలగా చెపుతోంది. బుద్ధిగా చదువుతున్న వాడికి మధ్యలో ఏమయిందో తెలియదు. 'ఇకనే చదవను' అని లేచి పారిపోయాడు. వాడిచుట్టూ పరుగెట్టి పట్టుకుని ఒక మొట్టికాయ వేసింది. వాడు ఏడుస్తూ అమ్మమ్మకు ఫిర్యాదు చేసుకున్నాడు. ఆమె కోపంగా వచ్చి "వాడు చదువుకోకపోతే ఇక్కడ తరిగేదేమీ లేదు. తను కాలుమీద కాలు వేసుకున్నా జరిగిపోతుంది. కానీ తల్లీ! వాడిని మాత్రం నువ్వు చావబాదకు. ఆ

తర్వాత వాళ్ళమ్మకు నేను చెప్పుకోవాలి" అంది. అమ్మమ్మ వెనక ధైర్యంగా నిలబడి వెక్కిరిస్తున్నాడు. దాంతో రెచ్చిపోయి రెక్క పట్టుకుని ఇవతలకు లాగింది. వాడికి భయమేసి వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించాడు. వాడిని గుండెల కదుముకుంటూ తన ముఖంలోకి చిటపట చూస్తూ అంది అమ్మ 'గొడ్రాలికేం తెలుస్తుంది కడుపుతీపి."

ఆ తర్వాత ఆ మాటన్నందుకు అమ్మ చాలా నొచ్చుకుంది. అది వేరే విషయం. కాని తను చాలా బాధపడింది. రెండు రోజులు మాటలు మానేసి ఉపవాసాలు చేసింది. కానీ.... ఇప్పుడు తలచుకుంటే అనుభవాల రథంలో నిల్చుని ఆలోచిస్తే అమ్మ అన్న మాటలలో ఎంత నిజముందో! అనిపిస్తుంది.

ఆమె ఆ మాట మనస్ఫూర్తిగా అనలేదు కాబట్టి అది శాపంగా పరిణమించి తను గొడ్రాలు కాలేదు. కాని ఈనాడు తన బిడ్డలమీద తను చెయ్యెత్తలేదు. పరాయి బిడ్డ మీద వున్న స్వతంత్రం కూడా స్వంత బిడ్డలమీద లేదు. అందరూ కలసి తన రక్తాన్ని చల్లార్చేశారు. అమ్మ అన్నట్టు కడుపుతీపి తనను చెయ్యెత్తనివ్వకుండా చేసింది.

ఆ మర్నాడు అక్క వచ్చింది. తన కొడుకు ప్రజ్ఞా విశేషాలకు పొంగిపోయింది. ఆమె తన్ను మెచ్చుకునే సమయంలో అమ్మ దూకుడుగా వచ్చి అంది అక్కతో.

"పాపా! ఇక నీ కొడుకును తీసుకుపో తల్లీ. జగతి వాడిని చంపేస్తుంది. ఇక నా తరంకాదు వాడిని రక్షించడం" అక్క నవ్వి ఊరుకుంది. నాలుగురోజులయిపోయాక అక్క వెళ్ళిపోతూ "వీడినాన్న బెంగపెట్టుకున్నాడు.... వీడి మీద. కొన్ని రోజులుంచుకుని పంపుతాను" అని వెంటబెట్టుకుని వెళ్ళిపోయింది. చాలా రోజులయ్యాక వాడిని చూడాలనిపించి జాబు వ్రాస్తే, "ఇక్కడ కాన్వెంటులో చేర్చాము. బాగానే చదువు కుంటున్నాడు. తొందరలో నీ కొడుకు ప్రజ్ఞ చూపడానికి తీసుకొస్తాను" అని వ్రాసింది. తన మనస్సు చివుక్కుమంది. "వాడిని తను కొట్టడం అక్కకు కూడా ఇష్టం లేదా?"

వాడు వెళ్ళిపోయాక కొన్ని రోజులకు గాని తెలిసి రాలేదు. వాడంటే తన హృదయంలో గూడుకట్టుకున్న మమత, అనురాగం. ఒక్కోరోజు వాడి చిలిపిచేష్టలు, వాడి తెలివితేటలు గుర్తుకొచ్చి మనసు వాడివైపుకు దారితీసేది. వాడిని కొట్టినందుకు తనను తానే నిందించుకునేది. ఒకరోజు అమ్మతో అంది 'అమ్మా నాకు కన్నడిని చూడాలని వుంద'ని. అమ్మ నవ్వి అంది "ఏం చెయ్యి దురద పెడ్తోందా?" ముడుచుకు పోయిన తన ముఖాన్ని చూచి మరలా అమ్మే అంది.

"వాళ్ళు దూరాన ఉద్యోగం చేసుకునేవాళ్ళు. మాటి మాటికీ వాడిని తీసుకు రమ్మని ఉత్తరం వ్రాస్తే ఏం బాగుంటుంది?"

దానితో నోరు మూసుకుంది కాని మనసు నిలవడం లేదు. ఎందుకో పదే పదే వాడిని గట్టిగా హృదయానికి హత్తుకోవాలని, గాఢంగా ముద్దు పెట్టుకోవాలని, వాడి పనులన్నీ స్వయంగా చేయాలని, కొట్టకుండా వాడిని చదివించాలని, వాడు తన చుట్టూ "పిన్నీ! పిన్నీ!" అంటూ తిరుగుతూ వుండాలని, ఎన్నెన్నో ఊహలు. అవి పెరిగి పెరిగి తన్ను చుట్టుముట్టేశాయి. వాటి బలమయిన కౌగిలినుండి తప్పించుకోవడం తనతరం కాకపోయింది. అందుకే అక్కకి ఉత్తరం వ్రాసింది.

"అక్కా! వాడిని ఒక్క దెబ్బ వేశాననేగా నీకోపం. అంతమాత్రానికే వాడిని నా నుండి దూరం చేస్తావా? వాడిని నువ్వు కంటే కన్నావు గాక పదేళ్ళు పెంచాను నేను. నాకు వూహ తెలియని రోజులలో పది సంవత్సరాలన్నా నిండని నాకు వాడినప్పగించి వెళ్ళిపోయావు. తీరా పది సంవత్సరాలు పెంచాక మమతలు పెంచుకున్నాక నిర్దాక్షిణ్యంగా నా దగ్గర నుండి లాక్కుపోయావు. వాడిని ఒక్క దెబ్బవేసే అధికారం నాకు లేదనికదూ అమ్మ అభిప్రాయమూ, నీ అభిప్రాయమూను. పోనీలే... వాడిని ఒక్కమాఉ చూడాలని ఉంది పంపించు..."

దానికి జవాబు వెంటనే వచ్చింది.

"పిచ్చి జగతీ! ఎవరన్నారు వాడిని నువ్వు కొట్టకూడదని. వాడు నీ కొడుకు. నా కప్పుడప్పుడు అనిపిస్తుంది. నువ్వు ప్రేమించినంతగా వాడిని నేను ప్రేమించలేదని. మీ బావ వాడిని దూరంగా వుంచడానికి ఇష్టపడలేదు. అందుకే అక్కడ నుండి తీసుకొచ్చాను. అలా అని నీ మీద మీ బావకు అవిశ్వాసమనుకునేవ్. అదేం కాదు. ఇంకా ఇద్దరున్నా ఆయనకు వీడంటేనే ఎక్కువ ఇష్టం. ఎంతయినా మొదట బిడ్డ కదూ" అంటూ ఏమేమో వ్రాసింది. నాలుగు రోజులలో వాళ్ళ ఆఫీసు ప్యూను చేత రమేష్‌ను పంపించారు. వాడు కొద్దిగా పెద్దవాడయ్యాడనిపించింది. కానీ అల్లరి తగ్గలేదు. వాడి మీద చెయ్యి చేసుకోకుండా పది రోజులపాటు వాడితో చిన్నపిల్లలా ఆడుకుంది. మరలా వాళ్ళ నాన్న కబురుచేయగా తనను ఆవేదనకు గురిచేసి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకు తనకు పెళ్ళి సంబంధం ఒకటి వచ్చింది. ఆయన పెద్ద భూస్వామి. మారు మూల పల్లెటూరు. చదువు లేదు. కాని అందం వుంది. ముగ్గురు అన్నదమ్ములు వాళ్ళు. తల్లి తండ్రి లేరు. ఆఖరివాడు పెళ్ళికొడుకు. అందమైన వాడని మురిసిపోయినా చదువులేనివాడిని చేసుకోవడం ఇష్టం లేదని ఖచ్చితంగా చెప్పింది. సంస్కారం చదువుతో రాదమ్మా. ఎన్ని చదువులు చదివినా పొట్టకూటికే అన్నట్టున్న ఈ

కాలంలో ఆస్థి ఉన్నప్పుడు చదువు లేకపోయినా పర్వాలేదు జగతీ” అన్న అమ్మ మాటలతో తనూ ఏకీభవించింది. ఫలితం అతనితో తన జీవితం ముడిపెట్టబడింది. 'పెళ్ళితో పాటే స్త్రీ తన వ్యక్తిత్వాన్ని వదులుకోవలసి ఉంటుంది' అని తెలుసుకోవడానికి చాలాకాలం పట్టలేదు.

పెద్ద ఆస్థి వుందని అమ్మ మురిసిపోయినంత సేపు తీసుకోలేదు అది ఆరిపోవడానికి. ఆ ఆస్థిలో చాలాభాగం పెద్దబావ స్వార్జితమవడంతో ఇంటిలో గొడవలతో కోప మొచ్చి వాళ్ళు విడిపోతూ తమ ఆస్థి యావత్తూ తీసుకెళ్ళిపోయారు. తమకు మిగిలింది చాలా కొద్ది మాత్రమే. దానితో వ్యాపారం చేయాలనుకున్నారాయన. దానికొరకు ఇంకొంత డబ్బు పుట్టింటినుండి తెమ్మన్నారు.

తన పెళ్ళి చేయడానికి నాన్న ఎంత అవస్థలు పడ్డారో తనకు తెలుసు. పెద్ద కూతురిని పెద్ద యింటికి పంపించడంతో ఆయన ముసలివాడయ్యాడు. ఇప్పుడు రెండో కూతురి పెళ్ళికొరకు కట్నం డబ్బుకోసమై బిచ్చగాడైయ్యాడు. ఎలాగైతేనేమి తన ఎముకలు పిండి బిడ్డలను గొప్ప ఇళ్ళకు పంపాననే సంతృప్తి మాత్రం ఆయనకు మిగిలింది. ఇంకా యిద్దరు కూతుళ్ళున్నారు. అటువంటప్పుడు ఆయనను 'భర్త వ్యాపారం చేస్తారు డబ్బు కావాలి' అని అడగడం అవివేకమనిపించింది. ఆ విషయమే ఆయనతో చెప్పింది. “వాళ్ళింటి నుండి ఏనాడు విడిపోయి వచ్చానో అంతే. ఇక నేను వాళ్ళకు పరాయిదాన్ని. పరాయివాళ్ళ సొమ్ము అడగటానికి నా సంస్కారం ఒప్పుకోదు.” దానికి ఆయనకు కోపం వచ్చి “ఆ పరాయి ఇంటి గడప త్రొక్కడానికి వీలులేద”ని శాసించారు. తను ఊరుకుంది. కాని పుట్టింటినుండి ఉత్తరాల మీద ఉత్తరాలు రాసాగాయి. పండక్కు రమ్మని. అసలే కోపం జాస్తి. అందులో విసిగిపోయున్న తను ముందూ వెనకా ఆలోచించకుండా తల్లికి ఉత్తరం వ్రాసింది. ఇంకెప్పుడూ తన గురించి తలచవద్దని, వాళ్ళ గడప త్రొక్కబోవటంలేదనీ, దానితో ఉత్తరాలు కూడా ఆగిపోయాయి. ఆఖరికి తన ఆశయాలకనుకూలంగా తన బిడ్డలను పెంచాలనుకుంది. కాని ఆ ఆశకూడా లేకుండా పోయింది. “ప్రక్కింటివాళ్ళతో తగువేసుకోవద్ద”ని కొడుకును కొట్టబోతుంటే ఆయన వచ్చి 'వాడిమీద చెయ్యి ఎత్తావో నీ వీపు పగులుతుంది' అన్నారు. నిర్ఘాంత పోయింది తను. 'భర్త భార్యను కొట్టడమా? ఎంత చులకన కొడుకుముందు! ఇక వాడిని తనేం చేయగలదు! వాడినేమయినా అనబోతే 'నాన్నకు చెప్తాను' అని బెదిరించే వాడు. వాడితోనూ, భర్తతోనూ విసిగిపోయి పూరుకుంది.

"జగతీ!"

మధురస్మృతుల తలపులలో ఆమె పెదవులమీద మెరిసిన హాసరేఖ మాయమయింది.

ఎదురుగా నిల్చుని చిరునవ్వుతో తన కళ్ళలోకి సూటిగా చూస్తున్న భర్తకు ఈ విషయాన్ని ఎలా తెల్పడమా అని తటపటాయించింది. చెప్పడమంత కష్టమని కాదు. కాని తనింత మధురంగా ఊహించుకున్నదానిని, క్షణ క్షణమే ఎదురు చూస్తున్నదాన్ని అతను కొట్టిపడేస్తే, కాదంటే?...

అతని చిరునవ్వుతో ధైర్యాన్ని కూడగట్టుకుని అంది.

"మీకో విషయం చెప్పనా?"

"ఏ విషయం?... వుండు వుండు. నీ విషయం వినేముందు నేను నీకొకటి చూపెడ్తాను."

"ముందు నేను చెప్పేది వినండి మరీ..." చిన్నవాడు మరచిపోయిన అల్లరిని గుర్తుకు తెచ్చుకోవడానికి బలవంతాన ప్రయత్నించింది జగదీశ్వరి.

"ఊహూ నేను ముందు" అతనింకా సన్నగా నవ్వుతున్నాడు.

"అవునవును. మీరు భర్తకదూ. మీరే ముందు" నిండుగా నవ్వుతూ అన్నది.

"అహ ఎప్పటినుండటా ఈ పతివ్రతాత్వం" వెటకారంగా నవ్వి ముడుచుకుపోయిన భార్య ముఖాన్ని చేతుల్లోకి తీసుకుంటూ.

"నీకు చీరతెచ్చాను" అన్నాడు. ఆమె మాట్లాడలేదు.

"నీ చీరలన్నీ చిరిగిపోయాయి కదూ!" ఆమెను ఆప్యాయంగా గుండెలకత్తుకుంటూ అన్నాడు మెల్లిగా.

ఆమెకు ఆ ఆలింగనంలో హాయిగాని, అతని ఆప్యాయతకు సంతృప్తిగాని కలగలేదు. అతని వెటకారంలో క్రొత్త చీర ఆనందం కలగలేదామెకు.

"ఏం బాగులేదా? ఆముదం త్రాగినట్లు పెట్టావు ముఖం?"

"చాలా బాగుంది. రంగు, అంచు, నేత అన్నీ బాగున్నాయి. ఎంతయిందేమిటి?"

"నీకు అన్నీ నచ్చాలనే కొద్దిగా ఎక్కువ ఖరీదయినా కొన్నాను" ఆమె మాట్లాడలేదు. అతను లేచి వెళ్ళిపోతున్నాడు. గొంతు సవరించుకుని చెప్పింది.

"ఈ రోజు రమేష్ వస్తున్నాడు."

వెనక్కు తిరగకుండానే అన్నాడు "ఎవరు?"

"రమేష్!"

"ఉహూ" అని వెళ్ళిపోతున్న భర్తవైపు నిరాశగా చూచింది జగదీశ్వరి. పోనీ 'రావడానికి లేద'ని ఖచ్చితంగా చెప్పలేదు నయమే అనుకుని సంతృప్తి పడింది.

భోజనం చేస్తూ తలెత్తి, వడ్డిస్తున్న భార్య నుద్దేశించి అడిగాడు.

"ఎవరా రమేష్?"

"మా అక్కయ్య కొడుకు."

"ఓహో. అలాగా? మీ కాలేజీలో స్నేహితుడేమో అనుకున్నాను." అతని కళ్ళల్లో అనుమానానికి వణికిపోయిందామె.

"వాడు నా కొడుకు. నా మొదటి బిడ్డ" నిట్టూర్చింది నిశ్శబ్దంగా.

* * * * *

సంధ్య గూటికి చేరుకుంటోంది. ప్రకృతి కాంత ఆలింగనంలోని నలుపు తెలుపుల సమన్వయం వింతగా వుంది. పడమట దిక్కున ఆకాశంలో మారుతున్న రంగులు అద్భుతంగా వున్నాయి. ఎర్రటి కాంతిలో పచ్చటి చెట్లు పరమసుందరంగా కన్పిస్తున్నాయి.

గమ్యం దగ్గర పడుతున్నకొద్దీ రమేష్ గుండె వేగంగా స్పందించడం ప్రారంభించింది.

ఎలా పిన్నిని ఎదుర్కోవడం? ఎప్పుడో చూచిన పిన్ని ఇప్పుడెలా వుంటుంది? అమ్మలాగ పెద్దగా, నిండుగా, కళకళలాడుతూ, ఇల్లంతా బొంగరంలా తిరుగుతుంటుంది కాబోలు. ఎంతైనా యజమానురాలు. ప్రతి పనికీ ఆంక్షలు పెట్టడానికి అమ్మమ్మ లేదక్కడ. తన పిల్లలని తనిష్ట మొచ్చినట్టు కొట్టుకోవచ్చు... ఊహలనుండి బయటపడి మనసులోనే నవ్వుకున్నాడు రమేష్.

పగలంతా సాధించి చదువు చెప్పేటప్పుడు పిన్నంటే కోపమొచ్చినా, రాత్రి ప్రక్కన పడుకుని ఆమె తనను హృదయాని కత్తుకుంటే హాయిగా వున్నట్టనిపించేది. పగలంతా 'కొట్టే పిన్ని'లా అన్పించేది కాదు.

పసివయసులో దెబ్బలు మాత్రమే రుచి చూచిన తను వయసు పెరిగే కొందీ ఆమెలో అనురాగాన్ని కూడా చూడగలిగాడు. అమ్మమ్మ వాళ్ళింట్లో పిన్ని తప్ప తననెవరూ

తాకేవారు కాదు. పిన్ని కొట్టినా మిగతా వాళ్ళందరూ తనను రక్షించేవారు. కానీ వాళ్ళెవరూ తనను పిన్నిలా ప్రేమించలేదు.

ఇంత కాలానికి..... ఆ విషయం తలచుకున్నప్పుడు అతని కళ్ళు అర్ద్ర మయ్యాయి. అంతగా ప్రేమించిన పిన్నికి తనేమివ్వగలిగాడు? బంధాలన్నీ తెంచుకుని అమ్మతో పారిపోయాడొకరోజు.

ఇన్ని ఏళ్ళు... పిన్ని జ్ఞాపకాలలో పెరిగి ఈనాడు ధైర్యంచేసి ఆమె నెదుర్కో బోతున్నాడు. తలచుకుంటే విచిత్రంగానే వుంటుంది. 'ఇన్ని సంవత్సరాలు ఎలా వుండ గలిగాడు పిన్నిని చూడకుండా!"

* * * * *

"పిన్నీ!"

"క.... న్నా....!"

అంత దూరాన నిలబడి విచిత్రంగా, ఆనందంగా మిల మిల మెరిసే కళ్ళతో అనురాగమంతా అందులో నింపుకుని కన్నార్పకుండా చూస్తోంది ఆమె. 'ఎంత వాడయ్యాడు! ఇంకా చిన్ననాటి చిలిపివాడినే ఊహించుకుంది తను. ఇంత గంభీరంగా ఇంత పొడవున ఎప్పుడెదిగి పోయాడు! తను చిన్ననాటి స్మృతులనన్నింటిని ఎప్పుడు దొంగిలించుకున్నాడు? పది సంవత్సరాల పసికందు ఇంతలో పాతిక సంవత్సరాల యువకుడుగా నిల్చుని "పిన్నీ!" అని పిలిస్తే ఎలా భరించడం? అతి మధురమైన ఆడి బాల్యాన్ని ఎవరు లాక్కున్నారు? ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"పిన్నీ!"

"కన్నా!"

"ఎంతలా మారిపోయావురా?"

"పదిహేను సంవత్సరాలయింది పిన్నీ నువ్వు నన్ను చూచి" నవ్వడానికి ప్రయ త్నించాడు రమేష్.

"అవును నాకు తెలుసు... ఎలా వున్నావురా... ఇన్ని రోజులు పిన్నిని చూడకుండా" ఆమె గొణిగింది.

ఆలోచిస్తున్నాడతను.

"సన్నగా, తీగలా, చలాకీగా వుండే పిన్ని పూర్తిగా మారిపోయింది. ఆమె కంఠంలో ఎప్పటిలా శాసనం లేదు. కాని ఎప్పటి ఆప్యాయత వుంది. ఆమె కళ్ళల్లో అధికార యుతమైన అనురాగం కాదు అసహాయతతో కూడిన అనురాగం వుంది. కానీ... కానీ.... ఇన్ని సంవత్సరాలకు అదే గొంతు 'కన్నా' అని అదే పిలుపు. ఓ కాలమా! దీనినుండి ఎప్పటికీ నన్ను దూరం చేయకు."

కొడుకు చెయ్యి పట్టుకుంది. ఆమె పెదాలు నవ్వుతున్నాయి.

"బాగున్నావురా?"

"ఏం? బాగలేనా పిన్నీ"

"అల్లరిఘాతం పోలేదు" సన్నగా నవ్వింది.

"నువ్వు నన్ను ప్రేమించడం మానేంతవరకు నేను అల్లరి చేయడం మానను పిన్నీ."

ఆమె ఆ మాటలు విన్పించుకోలేదు.

"అమ్మ బాగుందా కన్నా."

"బాగుంది. నీతో పోటీకి లావెక్కుతూ" నవ్వాడు.

"అమ్మమ్మ నీ మధ్య చూశావురా" ఆమె కంఠంలో కన్నీళ్ళు కదలాడాయి.

"లేదు పిన్నీ! నేరుగా నీ దగ్గరకే వస్తున్నాను."

"పెద్దతనంలో ఎలావుందో ఏమో! చిన్నప్పుడామె చాదస్తంగా మాట్లాడి విసిగిస్తుంటుందని ఆమెకు దూరంగా నేరుగా రూములోకెళ్ళి పడుకునేదాన్ని. ఈనాడు చూడాలన్నా వీలు పడదు" దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

"ఒక్కమారు అమ్మానను చూడాలని వుందిరా" ఆమె కళ్ళనుండి టపటపరాలాయి కన్నీళ్ళు. కన్నార్పకుండా పిన్నివైపు చూస్తున్నాడతను.

'ఎలా పిన్ని కన్నీళ్ళు తుడవడం?'

"తాతయ్య ఆరోగ్యం బాగుందా?" తనను తాను సంబాళించుకుంటూ అడిగింది.

"ఫరవాలేదు పిన్నీ బాగానే వుంది."

"నా గురించి ఎప్పుడైనా అనుకుంటారా?" అతికష్టం మీద మెల్లిగా అడిగింది.

"ఎందుకనుకోరు పిన్నీ. నువ్వు పుట్టింటికి రాకపోతే మాత్రం వాళ్ళకు నువ్వు కూతురువేగా?"

"కాదురా నువ్వు అబద్ధం చెపుతున్నావు. నేను నా భర్తను పుట్టింటికి పంపమని ప్రాధేయపలేదని వాళ్ళకు కోపం, నాకు తెలుసు. వాళ్ళ అభిప్రాయం.... నాకు అహంకారం ఎక్కువని, వాళ్ళనెవరినీ చూడకపోయినా నేనుండగలననీ...."

"పిన్నీ!"

"నీకు తెలియదురా. అదంతే... అవును నిజమే నాకు అహంకారముంది. కాని వాళ్ళకు తెలియంది ఇంకొకటుంది. ఆ అహంకారపు పరదా వెనక నేనెంతగా... క్షణక్షణమూ కుమిలిపోతున్నానో వాళ్ళర్థం చేసుకోలేరు. అందుకు వాళ్ళు ప్రయత్నించను కూడా ప్రయత్నించరు."

...........

"....పోనీ నాకు వాళ్ళక్కరలేదు. వాళ్ళ బిడ్డలలో నేను ఒకతెనుకానూ? బిడ్డ తప్పు చేస్తే క్షమించకపోతే పోనీ శిక్షించడం ఈ విధంగా మాత్రం కాదు. నేనంటూ ఒక కూతురు నున్నానని వాళ్ళు మరిచిపోయారురా" ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది. విధిచేత మమకారాలనుండి వంచించబడ్డ తన జీవితాన్ని తలచుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది.

"పిన్నీ! నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావు పిన్నీ. అమ్మమ్మవాళ్ళు చాలా మార్లు అల్లుడికి కబురంపించారు. జవాబు లేకపోతే వాళ్ళే రావాలనుకున్నారు కాని నిన్ను కష్టపెట్టడం ఇష్టంలేక ఊరుకున్నాను. నాకు బాగా గుర్తుంది. ఆ రోజులలో అమ్మమ్మ ప్రతిరోజూ ఏడ్చేది" పిన్ని కన్నీళ్ళను తుడుస్తూ చెప్పాడు. కొద్దిసేపటికి తేరుకుంది ఆమె.

"ఇదేమిటి... పసివాడిముందు... ఏమిటో... ఎన్నాళ్ళకో నిన్ను చూడగానే నీ పిన్నికి మతి పోయిందనుకుంటున్నావు కదూ!" అని నవ్వి రమేష్ చెయ్యిపట్టుకుని గదిలోకి తీసికెళ్ళి మంచంమీద కూర్చోబెట్టింది.

"దూర ప్రయాణం... చూడు ఎలా నలిగిపోయావో! వుండు స్నానానికి నీళ్ళు తోడి వస్తాను. ఇక్కడే కూర్చో."

కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళే పిన్నివైపు విచిత్రంగా చూచాడు. ఎప్పుడూ గంతులేసే పిన్ని నడకేనా అది! ఏడ్చే పిన్ని కొత్తగా అనిపిస్తోంది అతనికి. పసివాడుగా తనెప్పుడూ పిన్ని ఏడవగా చూడలేదు. అమ్మమ్మ మీద, తనమీద అధికారం చలాయించే పిన్నే తనకు గుర్తు. తనను ప్రేమించేది నిజమే కాని ఇలా ఎప్పుడూ పిన్ని ఏడవగా చూడలేదు.

తన ప్రేమను పైకి వ్యక్తపరచలేదు. రాత్రి తను నిద్రపోయాడనుకుని గుండెలకత్తుకుని "నా కన్నా!" అనుకునే పిన్నే తనకు తెలుసు.

"రా, స్నానం చేద్దువుగాని" నిండుగా నవ్వుతోందామె.

తొట్టి దగ్గర అతను స్నానం చేస్తుంటే కొద్ది దూరంలో పీట వాల్చుకుని కూర్చుంది.

"నీ కాలేజి చదువు ఎక్కడ హైదరాబాదులోనేనా?"

"అవును."

"చెల్లెలేం చేస్తోంది?"

"పెళ్ళి చేసుకోబోతోంది" నవ్వాడు రమేష్.

"అప్పుడే పెళ్ళేంటి పసిపిల్ల?"

"పసిపిల్లేంటి పిన్నీ. ఇరవై సంవత్సరాలు వస్తేనూ."

"అప్పుడే" మనస్సులోనే గొణుక్కుని "తమ్ముడేం చేస్తున్నాడు!" అంది.

"బి.ఏ. ఫెయిలవుతున్నాడు."

"నవ్వులాటకాదు. నిజం చెప్పరా. నాకు మీ అందరి గురించి తెలుసుకోవాలని వుండదూ?...."

"అదేంటి పిన్నీ! నిజం. వాడికి చదువు రావడం లేదు. అదే అమ్మ బెంగ."

"నేను నమ్మను. నీ తమ్ముడికి చదువు రాకపోవడమేంటి?"

"వాడు నాకు తమ్ముడేగాని, నీ కొడుకుగా మాత్రం పెరగలేదుగా పిన్నీ" చేతిలోకి సబ్బు నురుగు తీసుకుంటూ అన్నాడు.

"నీచేత ఒక దెబ్బ తినందే ఎవరికి మాత్రం చదువెలా వస్తుంది" సంతోషానికి, దుఃఖానికి మధ్యస్థంగా కొట్టుకులాడుతున్న పిన్నిని నవ్వించాలనే ఉద్దేశంతోనే రమేష్ ఆ మాటన్నా ఆమెకు అది చాలా బలంగా గుచ్చుకుంది.

"పాపిష్టిదాన్ని ఎలా కొట్టగలిగేదాన్నో! కొట్టి కొట్టి నిన్ను దూరం చేసుకున్నాను నేను" గొణుక్కుంది ఆమె.

"భలే దానివి పిన్నీ!... అలా బాధపడ్తావేం?... నువ్వు కొడ్తే మాత్రం నాకు తెలియదూ నువ్వు నన్నెంతగా ప్రేమించే దానివో?" అని స్వరం తగ్గించి "నిజం పిన్నీ,

నీ పునాది లేకపోతే నేనెక్కడో మధ్యలో కూలిపోయేవాడినే. నా చెంపలమీద ఎర్రటి నీ వేళ్ళ గుర్తులే నన్నింతవాణ్ణి చేసాయి" అన్నాడు.

"చాలురా, చాలు. నన్నింకా అదృష్టవంతురాలిని చేయకు" ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. పెద్ద ఉద్యోగస్థుడైన ఆనాటి తన కొడుకును తదేకంగా చూస్తోంది. చిన్న రమేషుడికి స్వయంగా తను స్నానం చేయిస్తున్నట్టు, వాడు అల్లరి చేస్తున్నట్టు.... అనుభూతి చెందుతోంది ఆమె.

"పిన్నీ!" స్నానం పూర్తిచేసి తుండుతో తుడుచుకుంటూ పిలిచాడు.

"ఏరా?" ఉలిక్కిపడింది ఆమె.

"బాబాయెక్కడ పిన్నీ!"

"పొలంనుండి రాలేదు. నీకు పీట వేస్తాను. భోం చేద్దువుగాని రా!"

"ఇప్పుడే ఆకలిగా లేదు. అందరం కలిసి తిందాంలే పిన్నీ."

"సరేలే. వేషాలు వేయకు. నాకు తెలియదా ఏమిటి నీ ఆకలి విషయం?"

'అవును. నా గురించి నీకు ఏమి తెలియదు గనుక!' మనసులోనే అనుకుని పైకి మాత్రం నవ్వుతూ.

"అచ్చు చిన్నప్పటి పిన్నిలా మాట్లాడావు పిన్నీ!" అన్నాడు.

"అవునురా... చిన్నప్పటి పిన్ని...." అని ఏదో చెప్పబోయి ఆగి,

"తొందరగా రా" అంటూ వంటింట్లో కెళ్ళిపోయింది. ఎదురుగా కూర్చుని కొసరి కొసరి వడ్డిస్తున్న పిన్నివైపు తినడం మాని తదేకంగా చూస్తున్నాడు రమేష్.

"నా ముఖాన్నేం చూస్తావు. నీకిష్టమని బీరకాయ పప్పుకూర చేసాను తినరా."

అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

"పిన్నీ! నీ దగ్గరనుండి నన్ను తీసుకెళ్ళి కాన్వెంటులో చేర్చాక ప్రతి పనీ నేనే చేసుకోవాల్సి వచ్చేది. అటువంటప్పుడు నువ్వు గుర్తుకొచ్చి ఏడ్చుకునేవాడిని. అదేమిటో నాకు అమ్మగాని, అమ్మమ్మగాని గుర్తువచ్చేవారు కాదు."

ఆమె మాట్లాడలేదు. ఆమె కంట్లో ముత్యాల కంటె అందమైన రెండు నీటిబొట్లు మెరిశాయి.

* * * * *

అరుబయట మంచంమీద కూర్చుని చుట్టూ చూసాడు రమేష్. అప్పుడే ఉదయించిన అర్ధచంద్రుని కాంతితో పెరట్లో చెట్లు మసక మసగ్గా కన్పిస్తున్నాయి. వాటి నీడలు గోడమీద అటూ ఇటూ కదులుతున్నాయి. మల్లెపందిరి విరగబూసి నట్టుంది. గుబాళిస్తోంది వాసన. చాలాసేపటినుండి అతనిని ఒక ప్రశ్న వేధిస్తోంది. తను విన్నంతవరకు పిన్నికి ఇద్దరు పిల్లలు. కాని ఇంత చీకటిపడినా వాళ్ళు కన్పించరేం! అయితే తను విన్నది అబద్ధమా?

"పిన్నీ! నాకు తమ్ముళ్ళు, చెల్లెళ్ళు లేరా?"

అంతవరకు నవ్వుతున్న ఆమె ముఖం మలినమయింది.

"ఎంత దౌర్భాగ్యం! నీ తమ్ముళ్ళను గురించి తెలుసుకునే అవకాశమే నీకు లేకపోయింది" నిట్టూర్చింది.

నీకు ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు. పెద్దవాడు రాజు. రెండవది కమల. మూడవది భారతి. రాజు ఐదవ తరగతి, కమల మూడు, భారతి నింకా చదువేయలేదు.

"ఎక్కడికెళ్ళారు వాళ్ళంతా?"

"రాజు వాళ్ళ నాన్నతో పొలం వెళ్ళినట్టున్నాడు. కమల, భారతిని ప్రక్కింటికి తీసుకెళ్ళినట్టుంది."

చిన్నప్పుడు తనను ఎక్కడికీ పంపేది కాదు ఒంటరిగా. ఒకరోజు స్నేహితులతో ఆడుకుంటూ పిన్ని విషయం మర్చిపోయి దీపాలుపెట్టే వేళకు ఇంటికి వచ్చాడు. వాకిట్లో పిన్ని ఎదురుచూస్తోంది. కొడ్తుందని భయపడ్డాడు. కాని కొట్టలేదు. గబుక్కున ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది. అప్పుడు ఆమె కళ్ళల్లో జారిపడిన వెన్నెలరేఖను స్పష్టంగా చూచాడు. అటువంటిది కరెంటన్నా లేని ఈ వూరులో కొడుకు పొలం నుండి ఇంత ప్రొద్దుపోయినా రాకపోతే.... ఇంత నిర్వికారంగా ఎలా వుండగలుగుతోంది? మాట మళ్ళించి అడిగాడు.

"పిన్నీ! ఇప్పుడు కథలు వ్రాయడం లేదా?"

ఆమె అదోలా నవ్వి "లేదు" అంది.

రాజు పుంజును చంకనేసుకుని దూసుకుంటూ వచ్చాడు. పుంజును ముద్దు పెట్టుకుని వదిలి "అమ్మా! మన పుంజు...." అని ఏదో చెప్పబోతూ ప్రక్కనున్న వ్యక్తిని చూచి ఆగాడు.

"నువ్వేనా రమేషన్నయ్య వంటే.... అమ్మ నన్ను స్టేషనుకెళ్ళమంది... కాని, ఏం చేయను. ఈ రోజే కోడిపందాలు పెట్టుకున్నామాయె. నీకు తెలియదు. కాని ఓహ్ మా కోడి వుంది చూసావ్ ఒక్క గెంతు గెంతిందంటే ఛస్...." పెదవి విరచి ఇంకా చెపుతున్న రాజును వింతగా చూస్తున్నాడు రమేష్.

"అది సరే. పట్నంనుండి వచ్చావు కదా! నాకేం తెచ్చావు?" తన ధోరణిని మధ్యలోనే ఆపి అడిగాడు. అప్పటికి తేరుకుని సూట్‌కేస్ తీసి వాడి కొరకని తెచ్చిన 'ఆల్బమ్' తీసి వాడి చేతికిచ్చాడు. వాడు దానిని అటూ ఇటూ త్రిప్పి, "దీనినేం చేసుకోనూ?" అన్నాడు అయిష్టంగా.

"దీంట్లో ఫొటోలు అంటించుకుంటారు." ఏదో పిచ్చివాడి మాటలు విన్నట్టు రమేష్‌వైపు చూచి పకపకనవ్వి "ఎక్కడో వెఱ్ఱిబాగుల వాడిలా వున్నావే. ఇందులో ఫొటోలంటించు కోవడమేమిటి? గోడకు తగిలించుకోవాలి కాని" అని ఆగి "అయినా పర్వాలేదులే. ఇది స్టాంపులు అంటించుకోవడానికి పనికొస్తుంది" అని దానిని పట్టుకుని తుర్రుమన్నాడు.

వాడు వెళ్ళినవైపే నమ్మలేనట్టు చూస్తూ వుండిపోయాడు రమేష్. తనను తీర్చిదిద్ది పెంచిన పిన్ని కొడుకును అలా వూహించుకోలేదు రమేష్. వాడు అలా మాట్లాడు తున్నప్పుడైనా ఆమె కసురుకుంటుందనుకున్నాడు. కాని ఆమె అంతసేపూ మౌనంగా ఎటో చూస్తూ కూర్చోవడం అతనికి ఆశ్చర్యాన్నే కలిగించింది. మెల్లిగా పిన్నివైపు తిరిగి అడిగాడు.

"పిన్నీ! నీకు కెమెరా వుండేది కదూ! ఏం చేశావు?" ఆమె నిర్లిప్తంగా జవాబు చెప్పింది. "ఎప్పుడో చెడిపోయింది."

పొలంనుండి వచ్చిన తన భార్యతో ఎవరో మాట్లాడుతుండడం చూచి ఆగిపోయా డతను.

"వీడే రమేష్" భర్తకు పరిచయం చేసింది.

"అహ ఎప్పుడు వచ్చారు? అంతా బాగున్నారా?" అన్నాడు అతను నవ్వుతూ. బాగున్నామన్నట్టు నవ్వి తల ఎత్తి పరిశీలనగా చూచాడు అతనివైపు రమేష్.

"ఎంత భారీ విగ్రహమితనిది! ఏమి సుందర రూపం" అతని పెదాలపై తారాడే చిరునవ్వును చూస్తూ అనుకున్నాడు రమేష్.

'ఇతనిని భర్తగా పొందగలిగిన పిన్ని ఎందుకు సుఖపడలేకపోతోంది?'

"పరీక్షలయిపోయాయా? ఇప్పుడు సెలవలా?"

"అవునండీ" ఆ అపరిచిత వ్యక్తిని ఎంత ప్రయత్నించినా 'బాబాయ్!' అని పిలవలేకపోయాడు. అందుకు పిన్ని ముందు తల వంచుకున్నాడు రమేష్.

తన భర్త రమేష్‌తో అంత మర్యాదగా, అంత చనువుగా మాట్లాడుతుంటే సంతోషంగా ఉక్కిరిబిక్కిరయింది జగదీశ్వరి.

* * * * *

"జగతీ!"

రాత్రి పదిగంటలవేళ నడవలో మంచంమీద కూర్చుని కన్నాతో కబుర్లు చెపుతున్న జగదీశ్వరి ఉలిక్కిపడింది భర్త కఠినమైన పిలుపుకు.

"కన్నా! ఇప్పుడే వస్తాను" అని తొందర తొందరగా భర్త గదిలోకి నడిచింది గాజుపూసల కర్టెను తొలగించుకుని.

"అసలు నీకు మొగుడనే వాడొకడున్నాడని జ్ఞాపకముందా?" భర్త గద్దింపుకు మౌనంగా తలవంచుకుని నిల్చుంది ఆమె.

"వాడు వచ్చిన దగ్గరనుండి చూస్తున్నాను నీ తరహా..... నా అతీగతీ కనుక్కునే దిక్కులేకపోతోంది ఈ ఇంట్లో."

"క్షమించండి. నాలుగు రోజులు వుండిపోయేవాడు."

ఆమె మాట పూర్తిచేసే లోపలే గట్టిగా అరిచాడు.

"అడ్డమైన వాళ్ళందరినీ పోషించడానికి నా దగ్గరేం రాసులు పోసి లేవు."

ఇక మౌనంగా వుండలేకపోయింది జగదీశ్వరి.

"వాడేం మనకులా గతిలేని వాడేంకాదు. వాడి పిడికెడు మెతుకులుకేగాక మనింటిల్లిపాదినీ పోషించగలడు కావాలంటే."

"మీ పుట్టింటి సొమ్ము కోరుకోవడానికి నేనేం సిగ్గులేనివాడిని కాదు. కావాలంటే వాడితోనే నువ్వూ ఊరేగు నాకేం అభ్యంతరం లేదు."

"ఎందుకు అంతంత మాటలంటారు నేను..." ఆమె కంఠం పూడిపోయింది.

భార్య కన్నీళ్ళల్లో అతని కోపం చల్లారింది. ఆమెను దగ్గరకు తీసుకుని బుజ్జగిస్తూ అన్నాడు.

"అలా ఏడవకు. నువ్వు అతనితోనే ఇరవై నాలుగు గంటలూ వుంటూ.... నన్ను నిర్లక్ష్యం చేస్తే ఎలా? అతను నీ కొడుకు కాని మరెవరన్నా కానీ, నువ్వు నాకు తప్ప ఇంకెవరికి ఏమీ కాకూడదని చెపుతున్నాను కదా! ఎందుకు నన్ను అర్థం చేసుకోవు?"

ఆమె అతనికి దూరంగా జరిగి కన్నీళ్ళు తుడుచుకుని అతని కళ్ళల్లోకి చురుగ్గా చూస్తూ అంది.

"అవును. మిమ్మల్ని నేనర్థం చేసుకుంటాను. కాని నన్నెవరు అర్థం చేసుకుంటారు?"

అతని జవాబుకైనా ఎదురు చూడకుండా గబగబా గడప దాటి ముఖం కడుక్కుని కొడుకు దగ్గరకెళ్ళి "ఆలస్యమయింది కన్నా. ఇక పడుకో" అని ప్రక్కనే ఇంకొక మంచం మీద పడుకుని కళ్ళు మూసుకుంది.

* * * * *

ప్రొద్దున్నే లేచి బెడ్డింగ్ కడుతున్న కొడుకును విచిత్రంగా చూచి,

"ఎందుకు కన్నా! సామాను సర్దుతున్నావ&" అంది జగదీశ్వరి.

"నేను వచ్చి అప్పుడే నాలుగు రోజులయింది పిన్నీ! అమ్మ నా కొరకు ఎదురు చూస్తుంటుంది."

"కన్నా!" ఆమె గొంతులో విషాదానికి చకితుడై కడుతున్న బెడ్డింగ్ ఆపి కళ్ళెత్తాడు రమేష్.

"కన్నా! నీ పిన్ని దగ్గర ఇక వుండాలని లేదటరా... నేను మాత్రం నీకు అమ్మను కానా?... మీ అమ్మకాదు నేను... నేనురా నీ కొరకు పదిహేను సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నది."

కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోతున్న పిన్ని చెయ్యి పట్టుకుని ఆపి "అది కాదు పిన్నీ!" అని ఆగాడు. నీళ్ళు నిండిన కళ్ళతో నిశ్శబ్దంగా కొడుకువైపు చూచిందామె.

"నీ దగ్గర ఎన్ని రోజులయినా వుండగలను పిన్నీ. కానీ.... కానీ రాత్రి..."

ఆమె ముఖం కాంతి విహీనమయింది. ఒక క్షణమయ్యాక గొణిగింది.

"నువ్వు విన్నావా?"

"విన్నాను పిన్నీ! అంతా విన్నాను."

అవమాన భారంతో ఆమె తల వంగిపోయింది. ఆ స్థితిలో పిన్నిని చూడగానే రమేష్ గుండెల్ని ఎవరో పిండుతున్నట్లనిపించింది. చటుక్కున లేచి పిన్ని కెదురుగా నిల్చుని ఆవేశంతో చెప్పసాగాడు.

"ఏమీ తెలియని పసితనంలో నీ నుండి పారిపోయాను. కానీ పిన్నీ! నీ జ్ఞాపకాలనుండి నాకు విముక్తి మాత్రం లభించలేదు. నేను దానిని కోరలేదు కూడాను. అమ్మతో వెళ్ళిపోయాక కూడా నీ దగ్గరకు పరుగెట్టు కొచ్చేయాలని ఆరాటం. తెలిసీ తెలియి వయసులో నాకెవరో చెప్పారు. 'ఇక పిన్ని నిన్ను చూడడానికి రాదని' ఎందుకో వెక్కి వెక్కి ఏడ్చానారోజు. 'పిన్నిని చూడాలని వుంది' అన్నప్పుడు అమ్మ మొదట కంట తడి పెట్టింది. పిన్ని కావాలని ఏడిస్తే కోప్పడింది. కొద్దిగా పెద్దవాడినయ్యాక కష్టనష్టాలన్నీ విడమర్చి చెప్పింది ఒకరోజు. ఆ రోజు నుండి ఈ రోజు వరకూ మారుమూల వున్న నీ గురించి తెలుసుకోవడానికే ప్రయత్నించాను. కాని తెలియందే ఎక్కువ వుండి పోయింది..." చెప్పడం ఆపి నిట్టూర్చాడు.

"ఎంత హుందాగా... ఎంత ఠీవిగా వూహించుకున్నాను.... నీ గురించి... నీ సంసారం గురించి... అంత ఎత్తులో అపురూపంగా.... నిల్చోబెట్టి ప్రతి క్షణమూ నిన్ను గురించి ఏవేవో తలచుకునే వాడిని... నీ గురించి నీ సంసారం గురించి ఎంతో ఉన్నతంగా నా కంటిముందు మేడలుకట్టుకునేవాడిని. నా పసి హృదయంలో అంత గాఢంగా అల్లుకుపోయావు నువ్వు. నా వూహలన్నింటిలోను నువ్వే. మహారాణిలా యాజమాన్యం చేసే పిన్నే."

"ఆ వూహతోనే బ్రతకాల్సింది నేను. ఎందుకొచ్చానిక్కడికి. తర్వాత ఈ స్థితిలో నిన్నెలా వూహించుకోవటం? ఎంతో హుందాగా చిత్రించుకున్న పిన్ని ఇంత అసహాయు రాలని తెలిసి ఎలా ఓర్చుకోవడం? అన్నీ పోగొట్టుకున్న నీ గురించి అందరూ కథలు కథలుగా చెప్పినప్పుడు నేననుకున్నాను నువ్వేమీ పోగొట్టుకోలేదని. నీ ఆత్మవిశ్వాసం నీకుంటుందని, నీ అహంకారాన్ని నువ్వు వదులుకోనందుకు సంతోషపడ్డాను. భోగ భాగ్యాలనుభవించకపోయినా నీ ఇంటిలో నీకు అధికారం వుంటుందనుకున్నాను.

మరొక్కమారు దానికి తలొగ్గడానికి సంతోషంతో ఇంతదూరం పరుగు పరుగున వస్తే... నేను చూచిందేమిటి?"

"పదిమందికి రెండు చేతులా బట్టలు దానం చేసిన నువ్వు ఈనాడు రెండు చీరలతో కాలం వెళ్ళబుచ్చుతున్నావంటే నేనందుకు సిగ్గుపడడం కాని బాధపడటం కాని లేదు. కానీ పిన్ని... నీ వ్యక్తిత్వం, ఆశయాలు, ఆదర్శాలు ఏమైపోయాయి? నీ ఆత్మాభిమానం దెబ్బతింటుంటే కూడా ఎలా సహించగలుగుతున్నావ్? ఎలా ఓర్చు కుంటున్నావ్ పిన్నీ! ఆజ్ఞాపించడమే తెలిసిన నిన్ను ఈ స్థితిలో చూడడానికి నా గుండె ఎలా గిలగిలలాడుతుందో నీకెలా చెప్పను?... ఇంకా నన్ను ఇవన్నీ చూస్తూ ఉండ మంటావా, పిన్నీ" ఆయాసంతో ఆగాడు.

అంతవరకు మౌనంగా వింటున్న జగదీశ్వరి అతనిని గట్టిగా గుండెల కదుము కుంది. అతని కళ్ళల్లోనుండి రెండు కన్నీటి చుక్కలు ఆమె భుజంమీద పడి ఇంకి పోయాయి.

"చాలురా. ఇంతకంటె ఇంకేదో కావాలనుకోవడమెందుకు? తల్లిమీద సానుభూతి చూపించే కొడుకువు నువ్వున్నావు" ఆ తర్వాత అతని తల నిమరడం తప్ప ఇంకేమీ చెప్పలేకపోయిందామె.

కొద్దిసేపయ్యాక పిన్ని గుండెలమీదనుండి జరిగి ఆమె కళ్ళల్లోకి ఒక్కక్షణం చూచి తల వంచుకుని "నన్ను వెళ్ళనీ పిన్నీ" అన్నాడు. కొడుకువైపు కళ్ళప్పగించి చూడడం తప్ప జవాబు చెప్పలేదామె. కళ్ళెత్తి మరలా అతనే అన్నాడు.

"నీమీదగాని, మరెవరి మీదోగాని కోపగించుకుని నేను వెళ్ళడం లేదు పిన్నీ! నేను స్థిరపడ్డాక నిన్ను తీసుకెళ్ళి కొన్నాళ్ళు నా దగ్గర వుంచుకుంటాను, వుంటావా పిన్నీ?"

ఆమె కన్నీళ్ళ మధ్యనుండి చిరునవ్వు నవ్వి అంది. "అలాగేలేరా ఇప్పటికి ఆగిపో, రాత్రికి వెళ్దువుగాని."

ఆ రాత్రి రమేష్‌ను బాబాయ్‌కు చెప్పి రమ్మని పొలంలో పడుకున్న భర్త దగ్గరకు పంపింది జగదీశ్వరి. గదిలో రాజు, కమల, భారతి అమాయకంగా, నిశ్చింతగా నిద్ర పోతున్నారు. వెళ్ళి రాజు ప్రక్కన పడుకుందామె. ఆ స్పర్శకు వాడిటు తిరిగి అమ్మను గట్టిగా పట్టుకున్నాడు.

నిగ నిగ మెరుస్తున్న వాడి బుగ్గమీద ఒక ముద్దు పెట్టుకొని మనసులోనే అనుకుంది జగదీశ్వరి.

"వీళ్ళందరినీ వదిలి తనెక్కడికి వెళ్ళగలదు? ఈ మమతల బారినుండి తనకే నాటికి విముక్తి?"

కాళ్ళ దగ్గర చల్లగా తగలడంతో ఉలిక్కిబడింది.

"వెళ్ళొస్తాను. ఆశీర్వదించు పిన్నీ."

చటుక్కున లేచి కూర్చుని కాళ్ళు దగ్గరగా జరుపుకుంటూ, గాఢంగా నిట్టూర్చి అంది అస్పష్టంగా.

"కన్నా? నువ్వు అడగాలా బాబూ.... నా ఆశీర్వాదం కోసం" ఏదో పోగొట్టుకో బోతున్నట్టున్న పిన్నివైపు తదేకంగా చూస్తున్నాడతను. ఆమె వున్నట్టుండి అతని రెండు చేతులు గట్టిగా పట్టుకొని ఆవేశంగా అంది.

"కన్నా! నాకు భర్త కావాలి, పిల్లలు కావాలి, అదిచ్చే గౌరవం కావాలి. అన్నిటి మధ్యా నువ్వు కూడా కావాలి. కానీ.... కానీ... నీకేం చెప్పను... వెళ్ళు, వెళ్ళిపోరా. ఇంటికెళ్ళి ఇంకొకమారు పిన్ని తరిమేసిందని చెప్పు."

"పిన్నీ!"

అతను చెప్పే మాటలు విన్పించుకోకుండా అతని చెయ్యి పట్టుకుని వాకిట వరకు తీసుకొచ్చి రహస్యంగా కాతర కంఠంతో చెప్పింది.

"చూడు కన్నా! నా ఇంటి విషయలు అమ్మకుగాని, అమ్మమ్మకుగాని తెలియ నీయకు. నేను సుఖంగా వున్నానని చెప్పు." చెమ్మగిల్లిన కళ్ళతో ఆ చీకటిలో పిన్నివైపు చూచాడు రమేష్.

"ఎందుకురా అలా చూస్తావ్? ఇంకా పిన్నిలో అహంకారం, దురభిమానం మిగిలి వున్నాయనా?" సన్నగా నవ్విందామె. ఆ నవ్వు అతని చెవుల వరకు సోకి అతనిని బాధ పెట్టింది.

వాళ్ళిద్దరినీ దూరం చేయడానికి బండివాడు తొందర పడుతున్నాడు. కొడుకు తల వంచి నుదుటిమీద ముద్దు పెట్టుకొని అంది. "సుఖంగా వెళ్ళిరా కన్నా! అందరినీ అడిగానని చెప్పు."